చిన్నకథ

# పెద్దరికం

రచన: 'కేరా'

శ్రీనయ్యగారింటికి వెళ్ళటం నాకు మొదటినుంచీ అలవాటయిపోయింది. సీనయ్యగారిని తాతయ్య అని పిలవటంలో, ఓవిధమైన హృదయానందం మన శ్శాంతి లభించేవి. ఆయనకూడా చిన్నపిల్లలు, తనని ఆప్యాయంగా పల్కరించే వాళ్లంటే, యెంతో ప్రేమగా చూసేవాడు.

ఇదివరకటికి... ప్రస్తుతానికి నేను ఆయనలో గొప్పమార్పు కనిపెట్టాను. క్రిందటి రెండు సంవత్సరాలవరకు... డెబ్భైయేళ్ల ముసలివాడయినా, పిడిరాయిలా... గాలిపటంలా యెగురుతూ తిరిగేవాడు ...కాని యీరెండు సంవత్సరాల్లో, ఆయనలో గొప్పమార్పు కనిపించింది. కళ్లకి చత్వారం... లేవలేనిస్థితి యేర్పడింది. వయస్సు కారణంగా నాకేం తోచలేదు. ఆయన్ని యేదో ఒక మనోవ్యథ పీడిస్తూ వుండాలి.

సుమారు వంద ఎకరాల ఆస్థి... ఊరిలో మంచి గౌరవం, పేరుప్రతిష్టలు వున్నాయి. అంత వున్నా అనుభవించటానికి యెవ్వరూ లేకపోయారు, ఒక్క మనమరాలు వనజతప్ప... కొడుకు, కోడలు యిద్దరూ శాశ్వత ప్రయాణంకట్టుతూ... యీ పసిగుడ్డుని ఆయనకి అప్పగించిపోయారు. ఆయన భార్య తనకు యీ ప్రాపంచిక విషయాలతో, యేమీ సంబంధం లేనిదానిలా, ముందుగానే మూట ముల్లె కట్టుకుని స్వర్గపురికి ప్రయాణమై వెళ్లిపోయింది.

మంచి యిల్లాలు. ఏనాడూకూడా, ఒక్కరి చేతనైనా, చాకిరీ చేయించుకోకుండా, పదిమంది ప్రశంసలతో, కులాసాగా దాటిపోయింది. ఇక యెటువచ్చీ ఆ దురదృష్టవంతుడు సీనయ్యగారికే, యీపాట్లు వచ్చాయి.

నేవెళ్లేసరికి సీనయ్యతాత, వరండాలో కూర్చుని చుట్టకాల్చుకుంటున్నాడు. మొగం దీర్ఘాలోచనతో ముకుతలుపడింది. ఇంట్లో ఆడదిక్కు లేదు... ఎక్కడి వస్తువులు అక్కడే, వాటి వాటి స్థానాలుతప్పి చిందరవందరగా పడివున్నాయి.

"తాతా" అన్నాను.

తలయెత్తిచుసాడు. సంతోషంతో మొగం కలకలలాడింది.

"ఏం, రా... రావటమే మానివేసావు. తాత చచ్చాడనుకున్నావా... వనజతోబాటు నువ్వుకూడా నన్ను వదిలిపోవాలనుకుంటున్నావా... ఏం?" ఒక్క బిగిని నాలుగు, ఐదు ప్రశ్నలు కురిపించాడు.

ఊళ్లో లేనని... వున్నట్లయితే తప్పకుండా వచ్చివుండేవాడనని... ఎన్నోవిధాల నచ్చజెప్పాను. అప్పటికి తాతకు సంతృప్తి కలిగింది. మెల్లగా నిట్టూర్చాడు.

"వనజను చూసివచ్చా తాతా" అన్నాను. ఆవేదన ఆయనలో స్పష్టంగా వ్యక్తమవుతోంది.

"ఆడపిల్ల" అన్నాను.

మొగం కలకలలాడింది. "నిజంగారా... నా తల్లికి ఆడపిల్లే... తల్లి లాగువుంటుందా.. మాటలు వచ్చాయా?" ఈ ముసలి ప్రాణానికి మనమరాలంటే కోపం అని... ప్రేమలేదని యెట్లా అనుకోను. అంతటి ఆవేదన... మనఃతాపం...

ఇతర్లు యెన్ని అన్నా నాకుమాత్రం తాతయ్య ప్రేమలో యేవిధమయిన లోటు కనిపించలేదు.

"పాపాయి అల్లరికూడా చేస్తోంది... తా... త... అంటూ ముచ్చటగా వచ్చీరాని మాటలు అంటుంది... కాని తాతా నువ్వుచేసినపని యెంతమాత్రం బాగాలేదు. వనజ అంతగా పట్టుబట్టినపుడు నువ్వు సరేనంటే పోయేదిగా... దాని మనసుకు దుఃఖంకలి

గించావు...నీకుకూడా శోభ తెచ్చిపెట్టుకున్నావ్ ...అదివుంటే యీ ముసలితనంలో, ఆసరా అయేదిగా...ఎందుకు తాతా...యీ పట్టుదలలు...యీ వంశ గౌరవాలు. ఆది కానిపని యేదీ చెయ్యలేదుగా..."

తాతయ్య అంతా విన్నాడు, తల ఆడిస్తూ... "నిజమేరాబాబూ...నువ్వన్నది. కాని అందరితో సమానమనిపించుకున్నావ్ కాని నన్ను బాగా అర్థం చేసుకోలా...ఇంకా నాలుగు రోజుల్లో యిద్దరికీ నేనే పెళ్ళిచేద్దామనే ప్రయత్నంలో వున్నా... పోనీ శంకర శాస్త్రుల్ని అడుగు...నీకే తెలుస్తుందిగా ...కాని వనజ తొందరపడిందిరా" అన్నాడు.

దేవాంతకుడు తాతయ్య మొత్తానికి పెద్దరికపు హోదా నిలబెట్టుకున్నాడు—

* * *

పదిహేను సంవత్సరాల క్రిందటిమాట. కొడుకు, కోడలు, భార్య అంతా చనిపోయినా, ఆ మనమరాలు వనజకోసం...తనప్రాణాన్ని నిలబెట్టుకుని...పెంచి పెద్దదాన్ని చేసాడు. చిన్నప్పటి నుంచీ నేనూ వాళ్ళయింటిలో ఒక వ్యక్తిగానే తిరిగేవాడ్ని. తాతయ్యకి ఆ వనజ యెంతో... నేనూ అంతే...

చదువు చెప్పించాడు. సంగీతం నేర్పించాడు. వనజమాట...రాణీ మాటకన్నా చెల్లుబడి. ఎప్పుడన్నా నాతో పంతంపట్టి వనజ పోట్లాడి తాతయ్య దగ్గరకిపోతే 'చిన్నపిల్ల కాదురా...దానిమాట చెల్లనియ్యి నాయనా...నీ వనజకాదూ' అనేవాడు. ఎంతో లబ్జుగా...పెద్ద జడ్జీకన్నా నేర్పుగా తగాదాలు తీర్చేవాడు తాతయ్య.

తాతయ్య యెంతటి గంభీరమైన మనిషో... అంతకంటె యెక్కువ ధాతృత్వం కలవాడని చెప్పవచ్చు. సరిగ్గా ఆరోజుల్లోనే ఓ విచిత్రమైన సంఘటన జరిగింది. ఓ పన్నెండేళ్ళ దిక్కుమొక్కులేని బ్రాహ్మణపిల్లవాడు ఆవూరు చేరుకున్నాడు. అంటే వాడికి తల్లీదండ్రీ అంతా జాడ్యాలలో చనిపోతే, రామప్ప పంతులుగారింటికని వచ్చాడు. సమానా మేనమామ...యెంతో ఆశతో—తనకి ఆశ్రయం లభిస్తుందని వచ్చిన ఆ పసిగుడ్డుని రామప్ప పంతులు అమాంతంగా ద్రోహంచేసి వదిలిపెట్టాడు. తనకు అసలు చెల్లెలు లేనేలేదని...ఈ పుత్ర వెధవ యెవరో తనకు తెలియదని...దేవుడిమీద ప్రమాణం కూడా చేసి చెప్పాడు.

తాతయ్య అన్నాడు 'పంతులూ...పాపం ఒడిగట్టుకోకు. పసికూన...ఎన్ని జపాలుచేసినా,




చురుకుదనం లేకపోతే సుఖమేలేదు!

ఈ విషయంలో స్త్రీలూ పురుషులూ సమానమే. ఉదయం లేస్తే ఈదురోమంటూవుంటారు. రాత్రియైతే "మన బ్రతుకే యింతనా" అని దుఃఖిస్తారు. ఇటువంటివారికి వరప్రసాదం అనాలి "బిజలీవటి", బిజలీవటి-బలం, ఉత్సాహం, చురుకుదనం, సుఖాసక్తి, ఒకరిమీద వొకరికి అనురాగం పెంపొందిస్తుంది. నిరుత్సాహులను ఆనందసామ్రాజ్యానికి అధినేతలుగాచేస్తుంది. 80 మాత్రల సీసా రు 2-0-0

బిజలీవటి

శ్రీ శృంగార్స్, 15 న్యూస్ట్రీట్, మన్నడి, మద్రాస్.

తపాలు చేసినా...ఒక్క ప్రాణికి ఆశ్రయమివ్వటంతో సరిరావు, గట్టిగా ఆలోచించు...'

పంతులు అగ్గయిపోయాడు. 'అంత కారుణ్యం వుంటే నువ్వే ఆశ్రయం యివ్వరాదూ...మాటలు చెప్పటానికేం ... చేసేసరికి బ్రతుకులు బయట పడతాయి.'

తాతయ్య యేమీ జవాబుయివ్వలా. ఆ పిల్ల వాడ్ని యెత్తుకుని యింటికి తీసుకుపోయాడు. ఆ రోజునుంచి వనజతోబాటు సుబ్బారావును కూడా తన కుటుంబంలోని వ్యక్తిలా చూస్తూ...ఒక మనిషిగా తయారుచేసాడు.

ఇంతకీ అసలు తగాదా—ఆ సుబ్బారావు, వనజల చిన్నప్పటి స్నేహం ... పెద్దవాళ్ళయింతర్వాత ప్రేమగా మారటంలోనే వచ్చింది.

తాతయ్య ముందుగానే యీ వ్యవహారం పసికట్టి వనజకు నచ్చజెప్పాడు 'కులం...గోత్రం...లేని పిల్లవాడు. పెంచి పెద్దవాడ్ని చేసాను. ఇక వాడి


## చేతిపనుల వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, బాణసంచ, అత్తరు, పన్నీరు, పప్పరమెంట్లు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి, పోస్టుఖర్చులు 5 అణాలు.

## కుట్టుపని స్వబోధిని

కోట్లు, ప్రౌజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు క్రొత్తపద్ధతులు డ్రాయింగులలో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీగ్రంథము చూచి సులభముగా నభ్యసించతగినది. ప్రతి దర్జీవారికిని ముఖ్యముగా చేతిలో వుండవలసిన పుస్తకము. ధర అ. 10.

మహారాజ పుస్తకశాల,

12, అరుణాచల మొదలివీధి, 18, బీటు, మద్రాసు.


బ్రతుకు వాడు బ్రతుకుతాడు. నా కర్తవ్యం నేను నెరవేర్చాను. కాస్తంత వంశమర్యాదలు చూడాలి ...అమ్మా.'

తాతయ్య పదేపదే చెప్పటంతో, వాళ్ళిద్దరి ప్రేమ మరింత దృఢపడింది. వనజ వినలేదు. తాతయ్య కోపగించాడు. 'ఒక్కరోజులో...వదిలించుకోవాలంటే సాధ్యంకాని వ్యవహారం. ఒకసారి హృదయాలు కలిసాయి. అతను నాకు బాగా తెలుసు. నేనంటే అతనికి అపరిమితమైన దయ... ప్రేమ...ఎల్లాగుచెప్ప తాతా...' వనజ అభిప్రాయం యీదారి పట్టింది.

తాతయ్య పట్టుబట్టాడు. వనజ... సుబ్బారావు యిద్దరూ కలిసి...ఓ రాత్రిపూట లేచిపోయి ...ప్రక్కవూరిలో గప్‌చిప్‌గా పెళ్లి చేసుకున్నారు. సుబ్బారావు చిన్న నౌఖరీ సంపాదించాడు. వాళ్ల జీవయాత్ర ఆవిధంగా పోతోంది.

సంక్షిప్తంగా జరిగిన విషయం యిది.

* * *

వనజదగ్గరకు పోయి...తాతయ్య పరిస్థితులు చెప్పాను. ఏడ్చింది...ఎలాగయితేం మొగుడూ... పెళ్లాన్ని యిద్దర్నీ ఒప్పించి యింటికి తీసుకువచ్చేసరికి పెద్దలు దిగివచ్చారు.

వనజ బండి దిగటం చూడగానే తాతయ్య వచ్చి పాపాయిని యెత్తుకున్నాడు. మనుమరాల్ని ఆప్యాయంగా తలనిమిరాడు...'నాయనా సుబ్బారావ్ రా. ...కోపగించి పోయారా...ముసలివాడి మీద అంత నిర్దయ యెందుకు నాయనా' తాతయ్య అనే ఒక్కొక్కమాట నాకు హృదయాన్ని కలచి వేసాయి. ఎంతటి ఆవేదనతో అంటున్నాడో నాకు బాగా అర్థమయింది...

ఆరోజునుంచి తాతయ్య వంట్లో మళ్ళీ సత్తువ వచ్చింది. ఇప్పటికీ కర్రపుచ్చుకుని వూళ్లో పెత్తనం చేస్తూనేవున్నాడు.

పెద్దల్ని యెందుకు గౌరవించాలో...ఆనాడు నాకు అర్థమయింది....